క్లుప్తంగా

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


కేబీఆర్ఎల్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

సాక్షి, భీమవరం: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి నైతిక విలువలను పెంపొందించుకోవాలని భీమవరం వన్ టౌన్ సీఐ అడబాల శ్రీను అన్నారు. శుక్రవారం కేబీఆర్ఎల్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పోలీసులకు ప్రత్యేకంగా ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని ప్రజా రక్షణే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పోలీసులపై గౌరవ భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెంటే హరినాథ్‌బాబు, తోట రామూర్తి, చెరుకువాడ రంగసాయి, కె.రాఘవ, నాచు శ్రీవల్లి, కె.ఛాయదేవి తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.లక్ష పలికిన దుర్గమ్మ లడ్డు


కోమటిగుంటలో లడ్డు ప్రసాదంతో యువకులు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలోని విజయ కనకదుర్గమ్మ ఆలయం 39వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 108 కేజీల లడ్డుని రూ. 1,00,000కు వేలంపాటలో భక్తులు దక్కించుకున్నారు. దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ యలమంచిలి రామాంజనేయులు(అంజి) అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో దక్కించుకున్నారు. అనంతరం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ):లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, జనతా చారిటబుల్ ట్రస్ట్ వారి పర్యవేక్షణలో దాత ఈతకోట తాతాజీ కుటుంబ సభ్యులు సహకారంతో కామినేని హాస్పటల్ విజయవాడ వారి ద్వారా పట్టణంలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 154 మందికి వైద్యపరీక్షలు చేశారు. 62 మందికి గుండె స్కానింగ్ ఎకో టెస్టులు, 80 మందికి ఈసీజీలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంగపండు రామమోహన్‌రావు, సీహెచ్ జగదీష్, కోశాధికారి జి.హరిబాబు, మదన్‌మోహన్ అగర్వాల్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిది సూర్యనారాయణ పాల్గొన్నారు.

'గూడెం' ఏఎంసీ చైర్మన్‌గా సంపత్‌కుమార్ నియామకం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ (గుంటూరు) ఉత్తర్వులు జారీ చేసినట్లు సంపత్ కుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్, మరో 18 మందితో నూతన పాలకవర్గం ఏర్పాటు కానున్నది. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులురెడ్డి) తదితరులు లు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిలో అగ్రగామిగా భీమవరం

ప్రభుత్వ విప్ శ్రీనివాస్

భీమవరం(ప్రకాశంచౌక్): అభివృద్ధిలో భీమవరం పట్టణాన్ని అగ్రగామిగా నిలుపుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం పట్టణంలో 34వ వార్డులో నిమ్మకాయల వారి వీధిలో రూ.7 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను, అలాగే ఆర్ఆర్‌డీఎస్ కాలేజీ నుంచి సూర్య టవర్స్ వరకు రూ.28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది మాటల్లో కాదని చేతల్లో చేసి చూపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గత నాలుగున్నర ఏళ్లుగా భీమవరంలో ప్రతి వార్డులోనూ తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఇటీవల కాలంలో సుమారు రూ.9 కోట్లతో పట్టణంలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు డ్రెయిన్లు నిర్మించామని వాటిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తున్నామన్నారు. అలాగే అమృత్ పథకంలో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్లను ఒక్కొక్కటిగా త్వరలో ప్రారంభిస్తున్నామఅన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ముదునూరి సుబ్బరాజు, తోట భోగయ్య, ఏఎస్ రాజు, గాదిరాజు సుబ్రహ్మణ్య రాజు, కోడే యుగంధర్, సాంబ్రాణి నరేష్, స్వాతి సుబ్బరాజు, కందికట్ల ఎడ్వర్డ్, చెల్లబోయిన సూర్యప్రకాష్, అడబాల పవన్, అడబాల మోహన సాయిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం(ప్రకాశంచౌక్): 34వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్


వీరవాసరం: కనకదుర్గాంబ ఆలయం వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

అన్న సమారాధన ప్రారంభం

పట్టణంలోని మెంటేవారితోటలో ఉన్న శ్రీ బాల త్రిపుర సుందరీదేవి ఆలయంలో శుక్రవారం దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మద్దాల సత్యనారాయణ, సమతం తాతాజీ, లీల, తోట భోగయ్య, కోడె యుగంధర్, ఏ ఎస్ రాజు, కొప్పర్తి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయం వద్ద

భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గ్రంధి రవితేజ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల రామారావు , సీహెచ్ శేషగిరి, మావూరి సుందరరావు , గోపిశెట్టి విజయలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, నీలాపు నాగలక్ష్మి, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ పాల్గొన్నారు. అలాగే గొల్లవానితిప్ప రోడ్డులోని శ్రీ దుర్గా లక్ష్మి అమ్మవారు దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు ముగింపు సందర్భముగా శుక్రవారం ఉదయం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. గ్రంధి రవితేజ అమ్మవారికి మహా కుంభ నివేదన సమర్పించి అన్న సమారాధనను ప్రారంభించారు. సుమారు 3,500 మంది భక్తులు విచ్చేసి అన్న ప్రసాదం స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ పిప్పల సూర్యరావు, ధర్మకర్తలు, ఈఓ గొట్టుముక్కల నాగ సీతారామరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వీరవాసరంలో..

వీరవాసరం: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం గ్రామంలోని కనకదుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, గొలగాని సత్యనారాయణ, బోను జోష్టదేవి, వీరవల్లి కనక ఉషారాణి, కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కందుల సురేష్, గ్రామ సర్పంచ్ చికిలే మంగతాయారు, మద్దాల నరసింహమూర్తి, నూకల కనకరావు,మద్దాల అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల వద్ద అన్నసమారాధనలు

భీమవరం అర్బన్: మండలంలోని దొంగపిండి గ్రామంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఘనంగా అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా కనక దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ వంటకాలు తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సుమారు 6 వేల మంది వివిధ వంటకాలతో ఘనంగా అఖండ అన్నసమారాధన చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక కొత్తపేటలో ఉన్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించి అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన చీరలను వేలం వేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధాపురం విద్యార్థులు

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెంలో జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లాస్థాయిలో కోకో, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. కోకోలో అండర్-14లో కె.గాయత్రీ, అండర్-17లో కె. కృష్ణ చైతన్య, అండర్-17 కేటగిరిలో జి.రమ్య 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం కైవశం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల్ని, అందుకు సహకరించిన పీడీ మోహన్‌ను హెచ్ఎం అభినందించారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


కాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలోని ప్రాతళ్లమెరక గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పీవీఎల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, నాయకులు వేగేశ్న గణపతి వర్మ, హరి వర్మ, వేగేశ్న జయ రామకృష్ణరాజు, పెనుమత్స ప్రసాదరాజు, కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంద్రలో....

పాలకోడేరు: ప్రతి పేదవాడిని ఆరోగ్యవంతుడిని చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్రమంతా నిర్వహిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. వేంద్రలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ భారతదేశం లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్రం లో వలంటీర్లను, ఏఎన్ఎంలను, ఆశా వర్కర్ లను మీ ఇంటికే పంపించి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే సచివాలయ స్థాయిలోనే స్పెషలిస్టు వైద్యులతో సేవలను అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, నాయకులు బొల్లా శ్రీనివాసులు, కడలి నాగేశ్వరి, భూపతిరాజు సుబ్బరాజు, పాలాజ్యోతి, భూపతి రాజు సత్తిబాబు, వేగి రమణ, వేణు, బుడితి నాగరాజు, కేసు బోయిన వెంకటేశ్వరరావు, దొరబాబు, డాక్టర్ డి.ఆర్ స్వర్ణలత, భూపతి రాజు వంశీకృష్ణం రాజు, గెద్దం జోషి, బొక్కా రాంబాబు, పాలా రాధాకృష్ణ, చెల్లబోయిన పాపారావు తదితరులు పాల్గొన్నారు.


పాలకోడేరు: వేంద్రలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

ఆర్‌బీకేల వద్ద ఈ-క్రాప్ నమోదు జాబితాలు

ఆకివీడు: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని నమోదులో తప్పులను సరిజేసుకునే అవకాశాన్ని ఈ నెల 29 వరకూ ఉందని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కాళింగగూడెంలోని ఆర్బీకే వద్ద శుక్రవారం ఈ-క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ ద్వారా రైతులకు కలిగే లాభాను వివరించారు. ఆకివీడు సహాయ సంచాలకుల పరిధిలోని ఆకివీడు మండలంలో 1878 మంది రైతులు 3,816 ఎకరాల్లో వరి సాగుకు ఈ-క్రాప్ నమోదు అయిందన్నారు. కాళ్ల మండలంలో 1855 మంది రైతులు 3,878 ఎకరాల్లోనూ, ఉండి మండలంలో 4,551 మంది రైతులు 10,792 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు ఈ-క్రాప్ నమోదు అయిందని శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఎమ్మార్పీ ప్రియాంక, గ్రామ మాజీ సర్పంచ్ గురువెల్లి రఘుప్రసాద్ పాల్గొన్నారు.

ఉండిలో...

ఉండి: ఈ-క్రాప్ ద్వారా పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలతో కూడిన జాబితాలను ఆయా గ్రామ సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ప్రదర్శించామని వాటిని ఈ నెల 29లోపు రైతులు సరిచూసుకోవాలని ఆకివీడు ఏడీఏ కేఏఏ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరు తదితర గ్రామాల్లో తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాబితాలో రైతుల వివరాలను తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. జాబితా ఏదైనా పొరపాటుగా నమోదైతే ఈ నెల 29 లోపు సరిచేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రా దుర్గారావు, వీఆర్ఓ ఎ.బాబీ, ఎం.మహేంద్ర పాల్గొన్నారు.


ఉప్పులూరులో ఈ-క్రాప్ నమోదుపై సోషల్ ఆడిటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కేంద్రం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి


భీమవరంలో మాట్లాడుతున్న హరేరామ్

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ కన్వీనర్ ఆకుల హరేరామ్ చెప్పారు. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో తమ్మినీడి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో మండల కేంద్రాల్లో నవంబర్ 6న ఎఫ్ఐఆర్ కాపీలు దగ్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో లంకా కృష్ణమూర్తి, దండు శ్రీనివాసరాజు, పాలా శ్రీరామదాసు, చెల్లబోయిన రంగారావు, జేఎస్‌వీ గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న గ్యాస్ కంపెనీ పక్కన నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఉండి పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9650 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

30న రైతాంగ సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు

సాక్షి, భీమవరం: ఆక్వా, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 30న భీమవరం రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ హాల్లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సదస్సులో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని బలరాం శుక్రవారం విలేకరులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు నాయకులు వై.కేశవరావు, సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు మంతెన సీతారాం, వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.వేణుగోపాలరావు పాల్గొంటారన్నారు.

మహిళా సమాఖ్య సభలు విజయవంతం చేయాలి

ఉండి: నవంబర్ 17 నుంచి 19 వరకు నంధ్యాలలో నిర్వహించే రాష్ట్ర మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలనలు విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవానీ తెలిపారు. ఉండి ఏఎంసీలో నిర్వహిస్తున్న 15వ జిల్లా మహాసభ రెండవరోజు శుక్రవారం మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా నెక్కంటి జగదాంబ, ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఉపాధ్యక్షులుగా సోడదాసి సురోజిని, వాసారపు దేవీ, యర్రశెట్టి శాంతమణి, ఎస్.నాగలక్ష్మీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వివరించారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం


లఘు కల్యాణం నిర్వహించిన అనంతరం ప్రత్యేకాలంకరణలో ఉత్సవ విగ్రహాలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి ఆశ్వయుజ మాస వార్షిక లఘుకల్యాణం(చిన్న కల్యాణం) శుక్రవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మాగంటి ఝాన్సీరాణి, వారి కుమారుల ద్వారా వేదపండితుల నడుమ శాస్త్రోక్తంగా రాత్రి ఏడు గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ డీవీ కృష్ణంరాజు, ఆలయ ఈఓ మోకా అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

నేడు పెద్దింటమ్మ ఆలయం మూసివేత

ఆకివీడు: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం అమ్మవారికి నైవేద్యం సమర్పించిన తరువాత ఆలయాన్ని మూసివేయనున్నట్లు స్థానిక పెద్దింటి అమ్మ ఆలయ అర్చకులు పవన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. శనివారం రాత్రి చంద్రగ్రహణం ఏర్పడనుందని అనంతరం ఆదివారం ఉదయం సూర్యోదయం తర్వాత ఆలయం తెరిఇచి సంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తి చేసిన తరువాత భక్తుల దర్శనానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అదే విధంగా స్థానిక మాదివాడలోని మల్లేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి, వనువులమ్మ అమ్మవారి ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తారని ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

తణుకు టౌన్: మండలంలోని వెంకట్రాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమానికి అవసరమైన వంట పాత్రలను వైఎస్సార్ సీపీ నాయకులు పాఠశాలకు అందజేశారు. శుక్రవారం పాఠశాలకు ప్రభుత్వం అందించిన జగనన్న గోరుముద్ద వంట పాత్రలతో పాటు విద్యార్థుల క్రీడలకు అవసరమైన ఆట వస్తువులను వైఎస్సార్‌సీపీ నాయకులు చదలవాడ బాబూరావు, తాతపూడి వరప్రసాద్‌లు సీసీహెచ్ పాఠశాల సిబ్బందికి అందజేసినట్లు హెచ్ఎం పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలకు ఎన్నడూ లేని విధంగా పాఠశాలలో సౌకర్యాలు పెరిగాయని, వాటిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పీసీ చైర్మన్ చింతలపూడి దుర్గాదేవి, జగనన్న గోరుముద్ద సీసీహెచ్ చదలవాడ ప్రశాంతి, ఉపాధ్యాయని ఎస్ అమ్మాజీ పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తి తెలుసుకునేందుకు పరీక్ష

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల మధ్య జ్ఞాన సామర్థ్యాలను తెలుసుకునేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు తాడేపల్లిగూడెంలో 64 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లోని 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబరు 3వ తేదిన పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా ఫలితాలను ఉన్నత స్థాయి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఓఎంఆర్ షీట్‌పై హెచ్ఎంలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.